# మినీఅంగన్‌వాడీలకు పెంచిన వేతనాలివ్వండి

- సీతక్క.. మీ మొదటి సంతకం మరిచిపోతే ఎట్లా?
- బీఆర్‌ఎస్ హయాంలో ఇచ్చిన జీవోను కాపీ కొట్టారు
- 'అంగన్‌వాడీ' ప్రచార సాధనాలు కాదు
- వారికి నిజమైన ఆత్మగౌరవం ఇవ్వాలి
- సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్ మే 20 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేస్తూ బీఆర్‌ఎస్ హయాంలో ఇచ్చిన జీవోను కాపీ కొడితిరి.. అధికారంలోకి రాగానే మంత్రి సీతక్క చేత మొదటి సంతకం పెట్టిస్తిరి.. కాంగ్రెస్ గద్దెనెక్కి ఏడాదిన్నర దాటినా పెంచిన జీతాలు ఇచ్చినట్టే ఇచ్చి మళ్లీ మొదటికి తెస్తిరి.. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆడబిడ్డల కడుపు కొట్టకుండా పెంచిన వేతనాలు ఇవ్వండి..' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను ఏకరువు పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. మంత్రి పెట్టిన మొదటి సంతకమే మరిచిపోతే ఎట్లా అని నిలదీశారు. మూడు నెలలు పెంచిన వేతనం రూ. 13,650 చొప్పున చెల్లించి మళ్లీ రూ. 7,800కి తగ్గించడం దారుణమని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు పెంచిన వేతనాలను తగ్గించే కొత్త సంప్రదాయానికి తెరలేపిందని ఎద్దేవా చేశారు. మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేస్తూ ఇచ్చిన జీవోనూ విస్మరించి మళ్లీ కొత్త జీవో జారీ చేయడం విడ్డూరమని పేర్కొన్నారు. 8 జిల్లాల వారికే పెరిగిన వేతనాలు అందాయని, మిగిలినవారు ఎదురుచూస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రచార సాధనాలు కాదని.. వారికి ఆత్మగౌరవం కావాలని ఉద్ఘాటించారు. 'మంత్రి మొదటి సంతకం చేసిన జనవరి 2024 నాటి నుంచి పెరిగిన వేతనాలు ఇవ్వాలి.. వెంటనే హెల్పర్లను నియమించాలి' అని డిమాండ్ చేశారు.

### బీఆర్‌ఎస్ హయాంలోనే అప్‌గ్రేడ్..

మారుమూల పల్లెలు, గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న 3,989 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లను అప్‌గ్రేడ్ చేస్తూ బీఆర్‌ఎస్ సర్కారు 2023, సెప్టెంబర్ 5న జీవో ఇచ్చిందని, ఎన్నికల కోడ్ కారణంగా అమల్లోకి రాలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఈ జీవోను కాపీ కొట్టి కొత్త జీవో ఇచ్చిందన్నారు. మూడు నెలలు పెరిగిన వేతనాలిచ్చి మళ్లీ పాత వేతనాలే ఇస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు దేశంలోనే ఎక్కడా లేని విధంగా పెంచిన జీతాలను తగ్గించే కొత్త విధానానికి తెరలేపిందని ప్రస్తావించారు. రైజింగ్ అని చెబుతున్న ముఖ్యమంత్రి అంగన్‌వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. మినీ అంగన్‌వాడీలు పెండింగ్ వేతనాల కోసం మంత్రిని కలిసినా పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. ప్రచార ఆర్భాటం కోసం ఒకే సమస్యపై రెండుసార్లు ఉత్తర్వులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఖరితో మినీ అంగన్‌వాడీ టీచర్లు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా పెంచిన వేతనాలపై స్పష్టత ఇవ్వాలని, అన్ని జిల్లాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### హామీలు ఎగ్గొట్టి మహిళలకు మోసం..

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో మహిళలకు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి మోసం చేసిందని హరీశ్‌రావు లేఖలో మండిపడ్డారు. 'కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం.. ఆడబిడ్డ పెండ్లిళ్లకు తులం బంగారం ఇస్తాం.. యువతులకు స్కూటర్లు అందిస్తాం.. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు రూ. 18,000 వేతనాలు ఇస్తాం.. మినీ అంగన్‌వాడీలకు పెరిగిన వేతనాలిస్తాం' అని మోసం చేసిందని నిప్పులు చెరిగారు. ఇప్పటికైనా మినీ అంగన్‌వాడీలకు పెరిగిన వేతనాలు ఇవ్వాలని, ప్రతి సెంటర్‌లో హెల్పర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

# పెండ్లయిన రెండురోజులకే..!

- కరెంట్ షాక్‌తో నవవరుడు మృతి
- వధువుకు అస్వస్థత..దవాఖానలో చేరిక
- రిసెప్షన్‌కు ఏర్పాట్లు చేస్తుండగా దుర్ఘటన
- మహబూబాబాద్ జిల్లాలో విషాదం

బయ్యారం, మే 20: పెండ్లి జరిగిన రెండు రోజులకే వరుడు విద్యుత్‌షాక్‌తో మృతి చెందగా.. కండ్ల ఎదుటే భర్త మరణాన్ని చూసిన నవవధువు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన మహబూబాబాద్ జిల్లా మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బయ్యారం మండలం గౌరారం పంచాయతీ పరిధిలోని కోడిపుంజుల తండాకు చెందిన ఇస్లావత్ బాలు, కౌసల్య దంపతుల చిన్న కుమారుడు నరేశ్ (25) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన జాహ్నవితో ఈ నెల 18న విజయవాడలో పెండ్లి జరిగింది. మంగళవారం కోడిపుంజుల తండాలో రిసెప్షన్ ఉండడంతో బంధుమిత్రులంతా హాజరయ్యారు. రిసెప్షన్ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇంట్లో నీటి కోసం వరుడు నరేశ్ బోరు మోటర్ ఆన్ చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. కండ్ల ముందే భర్త మరణాన్ని చూసిన వధువు కండ్లు తిరిగి పడిపోవడంతో మహబూబాబాద్‌లోని వైద్యశాలకు తరలించారు. కాళ్ల పారాణి ఆరకముందే వరుడు మృతి చెందడంతో పెండ్లింట తీవ్ర విషాదం నెలకొన్నది. విద్యుత్ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.



నరేశ్ దంపతుల పెండ్లి ఫొటో




# ఐఐటీల్లో ఆరువేల కొత్త సీట్లు

- ఈ ఏడాది అందుబాటులోకి 1,364 సీట్లు
- జోసా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : రాబోయే విద్యాసంవత్సరంలో ఐఐటీల్లో దాదాపు ఆరు వేలకు పైగా కొత్త సీట్లు అందుబాటులోకి రానున్నాయి. వచ్చే నాలుగేండ్లల్లో 6,576 సీట్లు అందుబాటులోకి వస్తాయి. ఐఐటీల విస్తరణకు కేంద్రం మంత్రివర్గం ఇటీవలే పచ్చాజెండా ఊపింది. విస్తరణ కోసం రూ. 11,828 కోట్లు మంజూరు చేసింది. 130 ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. దశలవారీగా కొత్త సీట్లు అందుబాటులోకి రానుండగా, 2025-26 విద్యాసంవత్సరంలో 1,364 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. నిరుడు ఐఐటీల్లో 17,740 సీట్లుండగా, రాబోయే నాలుగేండ్లల్లో మొత్తం సీట్ల సంఖ్య 19వేలకు చేరనున్నది. జాతీయంగా ఐఐటీ బూమ్ తారాస్థాయికి చేరింది. సీట్లన్నీ దాదాపు భర్తీ అవుతున్నాయి. గత పదేండ్లల్లో దేశవ్యాప్తంగా గల ఐఐటీల్లో మొత్తం విద్యార్థుల సంఖ్య 100% పెరిగింది. మొదట్లో విద్యార్థుల సంఖ్య 65వేలు ఉండగా, ఇప్పుడది 1.35లక్షలకు చేరింది.

**పెరగనున్న సీట్ల వివరాలు**

| విద్యా సంవత్సరం | పెరగనున్న సీట్లు |
|---|---|
| 2025-26 | 1,364 |
| 2026-27 | 1,738 |
| 2027-28 | 1,767 |
| 2028-29 | 1,707 |

### మరో ఆరు విద్యాసంస్థలు

ఐఐటీల్లోని సీట్లను భర్తీచేసే జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా)లో మరో ఆరు విద్యాసంస్థలు చేరనున్నాయి. 2025-26 విద్యాసంవత్సరంలో జోసా ద్వారా 127 విద్యాసంస్థల్లోని సీట్లను భర్తీచేయనున్నారు. నిరుడు జోసా కింద 121 విద్యాసంస్థలుండగా, ఈ సారి కొత్తగా ఆరు విద్యాసంస్థలు చేరాయి. 23 ఐఐటీలు, 31 ఎన్ఐటీలు, 26 ట్రిపుల్ ఐటీలు, 46 గవర్నమెంట్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్లు (జీఎఫ్‌టీఐ), ఐఐటీఎస్‌టీ శిబ్‌పూర్‌లోని సీట్లను జోసా కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఇప్పటికే పూర్తికాగా, జూన్ 2న ఫలితాలు విడుదలవుతాయి. ఈ సారి కూడా ఆరు విడతల్లో సీట్లను భర్తీచేసే అవకాశముంది. సంబంధించిన షెడ్యూల్ త్వరలోనే విడుదలకానున్నది.

# 'జీఐ' వస్తువుల పుస్తకావిష్కరణ

హైదరాబాద్, మే 20(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భౌగోళిక గుర్తింపు లభించిన వస్తువులు, ప్రాంతాల సమాచారంతో కూడిన పుస్తకాన్ని మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ టీ-హబ్‌లో ఆవిష్కరించారు. నాబార్డ్ సహకారంతో రిజల్యూట్ 4ఐపీ సంస్థ ఈ పుస్తకాన్ని రూపొందించిందని తెలిపారు.







# గురుకుల ప్రవేశ గడువు పొడిగింపు

హైదరాబాద్, మే20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని గురుకులాల్లో ప్రవేశాలకు విధించిన గడువును 25వ తేదీ వరకు పొడిగించారు. సొసైటీ సెక్రటరీ వర్షిణి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. సొసైటీ గురుకులాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్‌ఆర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలను ఇటీవల విడుదల చేశారు. అర్హత పొందిన విద్యార్థులు కేటాయించిన గురుకులాల్లో చేరేందుకు విధించిన గడువు మంగళవారంతో ముగిసిపోయింది. దీంతో తుది గడువును 25 వరకు పొడిగించినట్టు వర్షిని ప్రకటనలో తెలిపారు.

# టీజీఆర్జేసీ సెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. 35 గురుకులాల్లో మే 10న టీజీఆర్జేసీ సెట్ పరీక్షను నిర్వహించారు. 61,476 మంది పరీక్షకు హాజరయ్యారు. గ్రూపులవారీగా మార్కులు, ర్యాంక్ జాబితాను http://tgrjccet.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా కోర్సుల్లో సీట్లు కేటాయిస్తామని తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సీహెచ్ రమణకుమార్ తెలిపారు.

# రెండో విడత టీచర్ల శిక్షణ ప్రారంభం

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు టీచర్లకు రెండో విడత శిక్షణ మంగళవారం ప్రారంభమయ్యింది. 550 మండలాల్లో ఐదు రోజులపాటు 89,378 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా ఆన్‌లైన్ ద్వారా టీచర్లనుద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల మీద నమ్మకం కలిగేలా కాలానుగుణంగా టీచర్లు బోధనాపద్ధతులను మెరుగుపర్చుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలుచేయాలని, తద్వారా రాష్ట్రాన్ని విద్యాప్రమాణాల పరంగా ముందు వరుసలో నిలబెట్టాలని కోరారు. మొదటి విడతలో 17,771 మంది టీచర్లకు శిక్షణ ఇవ్వగా, రెండో విడతలో 89వేల మందికి శిక్షణ ఇస్తున్నారు.

# గుర్తింపులేని వైద్య కాలేజీలతో అలర్ట్‌గా ఉండాలి

### రాష్ట్రాలకు జాతీయ వైద్య మండలి సూచన

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): ఎన్ఎంసీ నుంచి అనుమతులు లేకుండా నడుస్తున్న వైద్య కళాశాలలపై అలర్ట్‌గా ఉండాలని ఆయా రాష్ట్రాలకు జాతీయ వైద్య మండలి సూచించింది. మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా వైద్య కాలేజీలు అనుమతి లేని వైద్య కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామని తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నాయని.. ఈ అంశమై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మన దేశంతోపాటు విదేశాల్లో వైద్య విద్య అభ్యసించాలనుకునే వారు ప్రవేశాలకు ముందే నియమనిబంధనలను తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించింది.

# మారిన టీజీఎస్పీడీసీఎల్ మొబైల్ నంబర్లు

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీఎల్) అధికారుల మొబైల్ నంబర్లు మారాయి. ఫ్యూజ్ ఆఫ్ కాల్, సెంట్రల్ బ్రేక్ డౌన్స్, ఓఅండ్ఎం సిబ్బంది, ఇంజినీర్లు, అధికారులు సెల్‌ఫోన్ నెంబర్లు మార్చారు. ఆయా నంబర్ల కోసం రెండు మూడు రోజుల్లో సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని అధికారులు తెలిపారు. విద్యుత్తు బిల్లులపై అసిస్టెంట్ ఇంజినీర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్(ఏఏవో)ల నంబర్లను ముద్రించాలని ముషారఫ్ ఫారూకీ అధికారులను ఆదేశించారు.

# లైసెన్స్‌డ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లతో పనులు చేయించుకోవాలి: సీఈఐజీ

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : విద్యుత్తు పనులను లైసెన్స్‌డ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లతోనే చేయించుకోవాలని.. క్వాలిఫైడ్ వైర్‌మెన్‌తోనే చేయించుకోవాలని చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ జనరల్(సీఈఐజీ) ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన విద్యుత్తు వైర్లనే వినియోగించాలని, లైట్ పాయింట్స్‌కు 1.5 స్క్వేయర్ ఎంఎం, పవర్ పాయింట్లకు 2.5 స్క్వేయర్ ఎంఎం, ఏసీ యూనిట్లకు 4 స్క్వేయర్ ఎంఎం కేబుళ్లను వాడాలని కోరారు. వోల్టేజ్ స్టెబిలైజర్లను వాడాలని సూచించారు.







